వడ్లమూడి పిచ్చయ్య

# విదేశంలో తొలిరోజులు



దాదాపు 50 సంవత్సరాల క్రిందట తెనాలి దగ్గర ఒక పల్లెటూరి నుంచీ అమెరికాలోని మహానగరం మినియాపోలిస్ కి జరిగిన నా సుదీర్ఘ ప్రయాణం వెనుక ఆసక్తికరమైన నేపథ్యమే ఉంది. అవి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజులు.. తెనాలి దగ్గర మోపర్రు మా స్వగ్రామం. హైస్కూలు, కాలేజీ అయ్యాక 1952-54 లో బెనారస్ లోని హిందూ యూనివర్శిటీలో ఎమ్మెస్సీ (మాథమాటిక్స్) కోర్సు చేశాను. నేను ఎమ్మెస్సీ చదివేప్పుడే మా బాబాయి వడ్లమూడి సుబ్బారావు గారు అమెరికా వచ్చారు. కానీ నాకప్పుడు అమెరికా చదువుల గురించి అంత అవగాహనా, ఆసక్తీ రెండూ ఉండేవి కావు.

బెనారస్ లో కోర్సు ముగించుకుని సొంత వూరికి వచ్చేసి, తెనాలి కాలేజీలో లెక్చరర్ గా చేరాను... ఆ ఉద్యోగం అంత చాలెంజింగ్ గా అనిపించలేదు.. ఏదో అసంతృప్తి. నాకున్న సమయంలో ఇంకా చాలా పనులు చేయొచ్చు... ఏమి చేయాలి? అప్పటికే అమెరికాలో వున్న మా బాబాయి గారు నన్నూ అమెరికా యూనివర్శిటీల్లో పై చదువులకి అప్లై చేయమని సలహా ఇస్తుండేవారు. ఐతే ఇంకా ఆ రోజుల్లో కేవలం ధనవంతులు మాత్రమే విదేశీ చదువులకి వెళ్ళేవారు.. మాలాంటి మధ్య తరగతి కుటుంబాల్లో అమెరికా వెళ్ళడం అంటే అసలు ఊహించని విషయం.

బాబాయి సలహా ప్రకారం నన్ను అమెరికా వెళ్ళమని ఇంట్లో వాళ్ళూ ప్రోత్సహించారు. అప్పట్లో మాకు ఇలాంటి విషయాల్లో సలహాదారు మా పినతాత కోటయ్య గారు (తెనాలి లో లాయర్, కల్లూరి చంద్రమౌళి గారి సహాధ్యాయి) . ముందుగా ఐతే నేను అమెరికా వెళ్ళడానికి ఆయన సుముఖత చూపించలేదు. మోపర్రులోనే ఉండి కుటుంబాన్ని చూసుకోమని సలహా ఇచ్చారు. ఐతే బాబాయి సుబ్బారావు గారు పదే, పదే చెప్పిన మీదట నా అమెరికా చదువులకోసం ఆయన అంగీకరించి, ప్రోత్సహించారు.

ఇక్కడ ఇంకో విషయం చెప్పాలి. ఇలా నా విదేశీ ప్రయాణం గురించి నా ప్రయత్నాలు జరుగుతున్న రోజుల్లోనే వినోద తో నాకు వివాహం జరిగింది.

పెళ్ళైన మూడు నెలలకి నా విదేశీ ప్రయాణం ఖరారైంది.

మద్రాసు నుంచీ పాస్ పోర్ట్. వీసా వచ్చేసాయి.. ముందుగా తెనాలి నుంచీ మద్రాసు ప్రయాణం. మద్రాసులో విమానం ఎక్కబోయే ముందు అక్కడ ఉన్నత స్థాయి ఉద్యోగంలో వున్న శ్రీ నాయుడమ్మ ( సెంట్రల్ లెదర్ ఇన్స్టిట్యూట్ కి డైరెక్టర్ గా పనిచేసి, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు) గారిని కలిసి, ఆయన ఆశీర్వచనాలు తీసుకున్నాను. అక్కడినుంచీ బొంబాయికీ, బొంబాయి నుంచీ న్యూయార్క్ కి టి.డబ్ల్యు.ఎ విమానంలో ప్రయాణం..

మద్రాసు నుంచీ బొంబాయి ప్రయాణంలో అంతగా తెలియలేదు కానీ న్యూయార్క్ ప్రయాణం మాత్రం చాలా ఇబ్బందిగా అనిపించింది. విపరీతమైనా శబ్దం..పక్కనే ఎవరో శ్వేతజాతి దంపతులు ఉన్నారు. ప్రయాణం పొడవునా వాళ్ళే నాకు గైడ్‌లా సహకరించారు. వారి బలవంతం మీదనే మొదటిసారి ఫ్లైట్ లో ఒక గ్లాసు వైన్ రుచిచూడడం, నాన్-వెజ్ ఫుడ్ తినడం జరిగింది.

..ఎలాగైతేనేం.. అగస్ట్ 26, 1955 వ తేదీన న్యూయార్క్‌లో పాదం పెట్టడంతో విదేశంలో తొలిరోజు మొదలైంది, నా జీవితంలో. అక్కడినుంచీ మరునాడు మినియాపోలిస్‌కి విమానం వుంది. ఐతే ఆ రోజు ఎక్కడ వుండాలీ, ఏం చెయ్యాలో అని ముందుగా ఏమీ ప్లాన్ చేసుకోలేదు.. ఎవరో అదృశ్య దేవత పంపించినట్లుగా అమెరికన్లే ఇద్దరు వొచ్చి నన్ను రిసీవ్ చేసుకుని రాత్రి హోటల్లో వుంచి, మరునాడు నన్ను మినియాపోలీస్‌కి వెళ్ళే విమానం ఎక్కించారు. వాళ్ళు యూనివర్సిటీ నుంచీ ప్రయాణ వివరాలు తెలుసుకుని నా లా వచ్చే విదేశీ విద్యార్థులకి సహాయం చేసే ఒక సంస్థకి చెందిన వాళ్ళని తరవాత తెలిసింది.

మొత్తానికి పెద్ద ఇబ్బందేమీ పడకుండానే మినియాపోలిస్ లో దిగాను. మా బాబాయి సుబ్బారావు గారొచ్చి నన్ను రిసీవ్ చేసుకున్నారు. అప్పటివరకూ కేవలం శాఖాహార భోజనం మాత్రమే అలవాటు నాకు. నా ఇబ్బంది గమనించిన సుబ్బారావుగారు ‘ఇక్కడికి దగ్గరలోనే ఒకరిద్దరు తెలుగు స్టూడెంట్స్ ఒక రూములో ఉంటున్నారు. వాళ్ళని పరిచయం చేస్తాను..పద ‘ అన్ని నన్ను అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక రూముకి తీసుకెళ్ళారు. వారిలో ఒకరైన జొన్నా రత్తయ్య గారిని చూసి ఆశ్చర్య పోవడం నా వంతైంది. ఆయనది మా పక్క వూరే. ప్రతిరోజూ మా వూళ్ళోంచి సైకిలు తొక్కుకుంటూ హైస్కూలుకి వెళ్ళేవాళ్ళు. మా వారి మనిషిని, మరో స్టూడెంట్ గా చూసే సరికి నాకు కొత్త ఉత్సాహం వచ్చింది. అప్పటికి మా క్లాసులు మొదలవడానికి ఇంకా నెలరోజులు టైం వుంది. ఇంక రోజూ సాయంకాలం వాళ్ళ రూముకి వెళ్ళడం, పగలంతా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్స్ సర్వే చేయడంతో నెలరోజులు



నా మొదటి పాస్ పోర్ట్

గడిపి అక్టోబర్ 1 , 1955 న యూనివర్సిటీలో క్లాసులకి హాజరవడం మొదలు పెట్టాను.

అప్పట్లో ఇండియన్ స్టూడెంట్స్ చాలా తక్కువమంది ఉండేవారు. తెలుగు వారి సంగతైతే చెప్పాల్సిన పనే లేదు. వేళ్ళ మీద లెక్కబెట్ట గలిగినంత మంది ఉండేవారంతే. నేను వచ్చింది పి -45 వీసా అవడం వల్ల బయట పని చేసుకునేందుకు వెసులుబాటు ఉండేది. రెండు మూడేండ్లు ఎలానో నెట్టేశాను గానీ 1958 లో వినోద కూడా అమెరికా వచ్చినప్పుడు నాకొచ్చే


అప్పటిక్లాస్ రూం లో నేను

ఆదాయం సరిపోక మరో పార్ట్ టైమ్ జాబ్ ఏమైనా దొరుకుతుందేమోనని ప్రయత్నిస్తుంటే మా యూనివర్సిటీలోనే సాయంకాలం సమయాల్లో ఒల్డ్ఏజ్ వాళ్ళకి పాఠాలు చెప్పే అవకాశం ఉందని తెలిసి వెళ్ళి అడిగాను. ఐతే ముందుగా నాకా అవకాశం ఇవ్వడానికి సందేహించారు. చెప్పాల్సింది అమెరికన్స్‌కే, అందునా ఓల్డ్ ఏజ్ విద్యార్థులకి.. అందువల్ల ఇంకా చదువు కూడా పూర్తి కాని నాకు అందునా నాన్-వైట్ కి ఇవ్వడానికి ముందు వాళ్ళు చాలా ఆలోచించి, ముందుగా ప్రయోగాత్మకంగా క్లాసులు చెప్పమన్నారు. రెండు మూడు క్లాసులు అయ్యాక వాళ్ళే నన్ను ఒదల్లేదు. ఆ విధంగా నాకు టీచింగ్ మీద పట్టు దొరికింది. ఆ అనుభవంతోనే మన్కేటో స్టేట్ యూనివర్సిటీలోనూ, తరువాత యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ లోనూ లెక్కల క్లాసులు బోధించే అవకాశమూ, అందులో నేను ప్రావీణ్యత సంపాదించుకోవడమూ జరిగింది.



నేను కొనుక్కున్న మొదటికారు

ఐతే వీసా సమస్య వల్ల మధ్యలో ఇండియా వెళ్ళి పోయి మద్రాసు ఐ.ఐ.టి లో లెక్చరర్ గా పనిచేసి, మళ్ళీ విస్కాన్సిన్ యూనివర్సిటీ స్పాన్సర్ ద్వారా 1967లో తిరిగి అమెరికా వచ్చాను. మధ్యలో ఇంకొక సారి 1987 లో మలేషియాలో 2 సంవత్సరాలు మినహాయించి దాదాపు 34 సంవత్సరాల పాటు యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్ లోనే పనిచేశాను. చివరిలో 7 సంవత్సరాల పాటు మాథమేటిక్స్ డిపార్ట్‌మెంట్‌కి ఛైర్మన్ గా కూడా పనిచేసే అరుదైన అవకాశం లభించింది.



విదేశాల్లో తొలిరోజులు అని తలచుకోగానే..ఈ జ్ఞాపకాలు..నా వద్ద చదువుకున్న వేలాది మంది స్టూడెంట్సూ గుర్తొస్తుంటారు.. తీపి జ్ఞాపకాలే జీవితాంతం తోడుంటాయి అనే వాక్యం ఎంత నిజమో అనిపిస్తుంటుంది, వెనక్కి తిరిగి ఆలోచించుకున్నప్పుడల్లా..!

****

డాక్టర్ వడ్లమూడి పిచ్చయ్య గారు 50 సంవత్సరాల క్రిందట అమెరికా వచ్చిన అతి కొద్దిమంది తెలుగు వారిలో ఒకరు. 34 సంవత్సరాల పాటు ఒకే యూనివర్సిటీలో టీచింగ్ ఉద్యోగం చేసి, పలు హోదాల్లో, పలు గౌరవ పురస్కారాలు పొందారు. మినియాపోలిస్ లో పాదం మోపిన ప్రతి తెలుగు వారు వారింట్లో ఆతిథ్యం పొందాల్సిందే 2000 సంవత్సరంలో రిటైరైన వద్దనుంచీ సిలికాన్ వేలీలో ఉంటున్నారు. వారి శ్రీమతి పేరు వినోద. పిల్లలు ఉష, వేద, పార్థు..అందరూ చక్కటి ఉద్యోగాల్లో సెటిలయ్యారు.

చిన్నప్పుడు మన వూరినించీ పక్క వూరికి వెళ్ళడమే పెద్ద థ్రిల్లింగ్ గా వుండేది కదూ..ఇప్పుడైతే భూగోళం చిన్నదైపోయి మన వూరు వొదిలి, రెక్కలు కట్టుకుని ప్రపంచంలో ఎక్కడికైనా ఎగరడానికి అవకాశాలు ఎన్నెన్నో.. ఎప్పుడైనా మన వూరు, మనప్రాంతం, మనదేశం వొదిలి పరాయి గడ్డ మీద అడుగు పెట్టడమే ఒక అందమైన అనుభవంఅయితే అక్కడ నిలదొక్కుకోవడం ఇంకో ఎత్తు.. మీరు మొట్టమొదటిసారి విదేశాల్లో స్థిరత్వంకోసం శ్రమించిన రోజులు గుర్తున్నాయా?..!? కొత్తదేశం, కొత్త మనుషులు, కొత్త అలవాట్లు, కొత్త ఆచారాలు.. విదేశాల్లో మీ తొలిరోజుల అనుభవాల్ని అందరితో పంచుకోండి.. వీలైతే ఫోటోలతో, మీ పరిచయంతో 2-3 పేజీల కథనాన్ని పంపించండి.